ఆ వయసులో చదువుకోవాలనే ఆసక్తి అతడికి ఎలా కలిగింది?

# చిరుదివ్వె

యస్.వివేకానంద కథ

"సి.ఎ...టి— క్యాట్!... అంటే పిల్లి గదా తాతయ్యా" ముద్దుముద్దుగా ఇంగ్లీషు అక్షరాలను వత్తివత్తి పలుకుతూ అడిగేడు అయిదేళ్ళ కీర్తి పుస్తకంలోంచి తలపక్కకు తిప్పి ఎదురు సోఫాలో కూర్చున్న సాంబయ్యను.

సాంబయ్య మౌనంగావుండిపోయాడు.

"ఆర్...ఎ...టి...— రేట్... అంటే.. ఎలుక... అవునా తాతయ్యా?... మాట్లాడవే...?" చేతిలో పుస్తకాన్ని పక్కనున్న టీపాయ్ మీద వుంచిన కీర్తి పరుగున వచ్చి సాంబయ్యను చుట్టేసుకున్నాడు.

"ఒరేయ్!... మీ నాయనలాగ నువ్వు కూడా పెద్ద డాక్టరై అమెరికా వెళ్ళాలి! — తెల్సిందా?" మనుమడ్ని ముద్దులాడుతూ ఆప్యాయంగా అన్నాడు సాంబయ్య.

"అమెరికా అంటే... అదెక్కడుంది తాతయ్యా" అమాయకంగా ప్రశ్నించాడు కీర్తి.

"అదా... అదీ... ఏమో ఎక్కడుందో? — నేనూ చూడలేదుగా!..." బుర్రగోక్కున్నాడు సాంబయ్య.

"ఏనాడైనా ఇల్లొదిలిపెట్టి బైటికెడితే గదా. ఏది ఎక్కడుందో తెలిసేది...?" కాఫీ అందిస్తూ చెప్పింది అప్పుడే అక్కడ కొచ్చిన సాంబయ్య భార్య గోవిందమ్మ.

"నీకు మహాతెల్సులే అన్నీ?... నీ జన్మలో ఒక్క తెలుగు సినీమాకైనా వెళ్ళావా?..." తిరిగి సాధింపు ధోరణిలో వడ్డించాడు సాంబయ్య.

"మీరు వెళ్ళనిస్తేనా?—" రాగం తీసింది గోవిందమ్మ.



అందుకున్న కాఫీ చప్పరించటంలో ము నిగిపోయాడు సాంబయ్య.

''కీర్తీ!... ఇవిగో నీకు పాలు తెచ్చాను. తాగు...'' చేతిలో వున్న ఇంకో గ్లాసు మనుమడికి అందించింది.

''వట్టి పాలు తేకపోతే... హార్లిక్సు కలిపి తేకూడదూ?'' పక్కనేవున్న భార్యనుద్దేశించి ప్రశ్నించాడు.

''పాలు తాగేసి... తర్వాత హార్లిక్సు తినేస్తాలే తాతయ్యా...'' ముద్దుగా జవాబిచ్చాడు కీర్తి.

''నా బాబే!—... నా బంగారు కొండే... '' అంటూ మనుమడిని లోపలికెళ్లిపోయింది గోవిందమ్మ.

ఐదేళ్ల కీర్తిని కాన్వెంట్‌లో చేర్చాడు సాంబయ్య. ముసలి దంపతుల పంచప్రాణాలు కీర్తిమీదే!

సాంబయ్యకి ఒక కూతురు ఒక కొడుకు

మూడోసారి పురిటికొచ్చిన కూతురు లావణ్య ఏడాది పిల్లవాడికి వెళ్ళేదాకా పుట్టింట్లోనే వుండి కొడుకు బాధ్యతని తల్లీ తండ్రికి వప్పగించి ఇద్దరి పిల్లల్తో భర్తతో కలిసి స్టేట్సు వెళ్ళింది.

లావణ్య భర్త అమెరికాలో డాక్టరు! ఒక్కగానొక్క కొడుకు సుధీర్ ఎం.టెక్ చేసి బెంగుళూరులో ఇంజనీరుగా వుంటున్నాడు. ఏడాది క్రితం కొడుక్కి కూడా ఘనంగా పెళ్ళి చేసాడు సాంబయ్య.

తన స్తోమతకి సమఉజ్జీగా వుండే వియ్యంకుడే వచ్చాడు.

సుధీర్ మామగారు రాజకీయాల్లో పండిపోయిన వ్యక్తి! దేశ స్వాతంత్ర్యంకోసం పోరాటం సలిపిన వారిలో ముఖ్యుడు! ఆ తర్వాత అనేకసార్లు ఎంఎల్‌ఎగా ఎన్నికల్లో పోటీచేసి గెలవటంతో పాటు మంత్రి పదవిని కూడా చేజిక్కించుకున్నాడు.

కూతురు ఎక్కడో విదేశాల్లో... కొడుకు తనకు దూరంగా వుంటుంటే వంటరితనాన్ని భరించలేని సాంబయ్య దంపతులు చివరి మనుమడినైనా తన దగ్గరుంచమని కుమార్తె లావణ్యని అడిగేరు.

తల్లిదండ్రుల మాట కాదన్లేకపోయింది లావణ్య! ఏడాది బిడ్డని... వాడి బాధ్యతని భవిష్యత్‌ని వారికి అప్పగించి వెళ్ళింది.

అల్లారుముద్దుగా పెంచి పెద్దచేస్తున్నారు కీర్తిని! కాలు క్రిందపెట్టనివ్వరు. కార్లోనే కాన్వెంటుకి పంపుతున్నారు.

కీర్తి కాన్వెంటులో చేరింది మొదలు ఇంగ్లీషు మాటలు పలుకుతూ ముద్దుగా మాట్లాడుతుంటే మురిసిపోతున్నాడు సాంబయ్య.

పొట్టపొడిస్తే అక్షరం ముక్కరాని సాంబయ్య స్వశక్తితో తెలివి తేటలతో లక్షలు సంపాదించాడు.

స్వంత బంగళా... కారు... ఇంట్లో టి.వి., ఫ్రిజ్... వాషింగ్ మిషను... ఎ.సి రూమ్... అన్నీ సమకూర్చుకున్నాడు. నాలుగైదు బ్యాంకుల్లో లక్షల క్యాష్ మూలుగుతోంది!

పదేళ్ళ వయసులో సాంబయ్యని మేనమామ సిటీకి తీసుకొచ్చాడు.

''ఇదిగో సీతాలూ!— నువ్వూ నీ మొగుడూ కడుపునిండా తిన్లేకపోతున్నారుగదా... సాంబిగాడ్ని నా వెంటపంపరాదూ... ఇప్పటినుంచే ఈడి బతుకేదో ఈడు బతుకుతాడు ...'' మట్టం మాపుగా అక్కయ్యని చూడటానికొచ్చిన యాదయ్య ఇంటి పరిస్థితి కళ్ళారా చూస్తూ అడిగేడు.

''కళ్ళఎదుట వుండే ఒక్క సన్నాసినీ నువ్వు తీసుకెడతానంటావా...?—'' కోటయ్య బాధగా అన్నాడు.

''ఇదిగో కోటయ్య బావా!... రెక్కల

కష్టంతో మీ ఇద్దరూ బతకండి!— సాంబడు నాతో వస్తే... నాకాడే పన్జేస్తూ... తాపీ పనైనా నేర్చుకుని పైకొస్తాడు... వాడు పెద్దోడై పనినేర్చుకుని పది డబ్బులు సంపాదిస్తే... మీరిద్దరు కూడా అప్పుడు సాంబడి దగ్గరకే వచ్చి వుందురుగాని!— ఏమంటావే సీతాలక్కా?!—''

తమ్ముడి యాదయ్య మాట సబబుగానే తోచింది సీతాలుకి!—

''అవునయ్యా!— ఆడి బతుకైనా బాగు పడనీ...'' పక్కనే వున్న మొగుడితో అంది.

కోడయ్యకి కంటిలో నీరు తొణికిసలాడినా... పదేళ్ళ కొడుకు దూరమైపోతున్నాడనే బాధ నరాలను కొరికేస్తున్నా... మారుమాట్లాడలేక సరేనన్నాడు.


''నీకేం భయంలేదు బావా... సాంబణ్ణి నా అంతటి వాడిని చేస్తాను. ఈడు లచ్చలు సంపాదిస్తాడు. వీడు చానా తెలివైనోడు... వీడికి నా కూతుర్ని గోవిందమ్మ నిచ్చి లచ్చనంగా పెళ్ళి కూడా చేస్తాను. అర్థమైందా...?—'

అక్కకు బావకు అన్ని విధాల నచ్చజెప్పి సాంబయ్యని తన వెంట తీసుకుని సిటీ చేరుకున్నాడు యాదయ్య.

తాపీ పనిచేస్తూ కాస్తో కూస్తో సంపాదించాడు యాదయ్య. యాదయ్యకి మగ సంతానం లేకపోవడంతో మేనల్లుడు సాంబయ్యని తాను చేస్తున్న వృత్తిలోకి దింపి ఒక్కగానొక్క తన కూతురు గోవిందమ్మనిచ్చి కట్టపెట్టాలని దూరం ఆలోచించాడు.

పదేళ్ళ సాంబయ్య మొదట్లో ఇసుక తట్టలు మోసాడు. తర్వాత సిమెంటు, ఇసుక కావలసిన పాళ్ళలో కలపటం తెల్సుకున్నాడు. కట్టుబడి పని ఆకళింపు చేసుకున్న సాంబయ్య అయిదేళ్ళు గడిచేసరికే తాపీ చేతికి తీసుకున్నాడు.

సాంబయ్య మరుగ్గా పని నేర్చుకుంటున్నందుకు కష్టపడి శ్రమ అనుకోకుండా పైకి వస్తున్నందుకు లోలోపల మురిసిపోసాగేడు



యాదయ్య.

ఇరవైయ్యేళ్ళొచ్చేసరికి స్వతంత్రంగా క ట్టుబడి పన్లు చెయ్యటం మొదలుపెట్టాడు సాంబయ్య.

పనిలో కత్తిలా తయారైన సాంబయ్యకి తన కూతురు గోవిందమ్మనిచ్చి పెళ్ళిచేశా డు యాదయ్య. ఆ తర్వాత రెండేళ్ళకే యాదయ్య కన్నుమూశాడు.

తనను పైకి తీసుకొచ్చి వృత్తిలో మెళకు వలు నేర్పి మంచి భవిష్యత్‌కి కారకుడైన మామ పోయినందుకు ఎంతో విలపించాడు సాంబయ్య.

కేవలం తాపీపనే కాకుండా... చవకలో భూమినికొంటూ వాటిని ఇళ్ళ ప్లాట్‌లుగా తయారుచేసి మంచి ధర పలుకగానే అమ్మే సి డబ్బు సంపాదించే మార్గాన్ని కూడా అన్వేషించాడు సాంబయ్య.

అన్ని విధాల అదృష్టం కలిసొచ్చింది సాంబయ్యకి. పనితనం వున్న మేస్త్రీగా పేరు సంపాదించాడు— పేరుతోబాటు డబ్బూ'' ఆర్జించాడు.

సిటీలో తాపీ మేస్త్రీ సాంబయ్య అంటే తెలీని వారు లేరు. నమ్మకస్తుడనే మాట ఆనోట ఆనోట పాకిపోయింది.

ఎన్నో ఇళ్ళు కట్టాడు. మరెన్నో ఇళ్ళను మారుబేరానికి అమ్మేడు.

లక్షలు సంపాదించాడు. డబ్బుతోపాటు గొప్ప పేరు కూడా వచ్చింది!

బేల్దారీ పని చేసుకు బ్రతికే వారినందరి నీ ఐక్యంచేసి వారికి నాయకుడయ్యాడు. సలహాలకు సంప్రదింపులకి అనేకమంది సాంబయ్యని ఆశ్రయిస్తుంటారు.

పగలనక రేయనక యాభైయ్యేళ్ళుపైబడే వరకూ కష్టపడి పనిచేసి సంపాదించిన సాంబయ్యకి ఇకపై విశ్రాంతి తీసుకోవాలన్పి ంచటంతో తాపీ పనికి స్వస్తి చెప్పాడు. సంపాదించినంతవరకు చాలని తృప్తిపడ్డాడు.

* * *

''తాతయ్యా!... తాతయ్యా!... ఇదిగో నా ప్రోగ్రెస్ కార్డు!!... క్లాసులో ఫస్టొచ్చాను తెల్సా!?—'' యూనిఫాం వేసుకుని కాన్వెం టునుంచి కార్లో వచ్చిన కీర్తి ఇంట్లోకి పరుగుపెడుతూ వచ్చి చెప్పాడు.

''ఫస్టొచ్చావా?... అంటే ఏందిరా—?'' ఎత్తుకుని ముద్దాడుతూ ఆప్యాయంగా అడిగే డు సాంబయ్య.

''అంటే... అంటే... ఈ మాత్రం కూడా తెలీదా నీకు?... పరీక్షల్లో నాకు అన్నింటిలో నూటికి నూరు మార్కులొచ్చి నయ్ అన్నమాట!!—'' తాతగారి చంక దిగుతూ గారంపోయి మాట్లాడేడు.

''అబ్బో... అబ్బో... అదా సంగతి!!— అయితే నీకేం కావాలో కోరుకో...''

''ముందునువ్వు నా ప్రోగ్రెస్ కార్డు మీద సంతకంచేసి పెట్టాలి!...''

''చెయ్యకపోతే ఏమౌతుంది?—'' కను బొమ్మలెగరేస్తూ ప్రశ్నించాడు సాంబయ్య.

''మా టీచరు నన్ను కొడుతుంది...'' కీర్తి బుంగమూతి పెట్టాడు.

''మరి... నాకు సంతకం చెయ్యటం రాదుగా... అందుకని వేలిముద్ర వేస్తాలే!— సరేనా...''

''వేలిముద్ర అంటే ఏంటి?—'' ఎమా యకంగా అడిగేడు కీర్తి తాత ముఖంలోకి

చూస్తూ.

"నాకు చదువు రాదుగదా..." ఇంకా ఏదో చెప్పబోయాడు సాంబయ్య.

"నీకు చదువురాదా తాతయ్యా?... షేమ్ షేమ్..." చప్పట్లు చరుస్తూ చిందులేశాడు కీర్తి.

సాంబయ్య ముఖం సిగ్గుతో ముడుచుకు పోయింది.

"నీకుమల్లే నేను చిన్నప్పుడు బడిలోకె ళ్ళలేదురా..."

"మీ తాతకు చదవటమే కాదు నాయ నా... వ్రాయటంకూడా చేతగాదు..." అప్పుడే అక్కడికొచ్చిన గోవిందమ్మ లంది.

"చాల్లేవూరుకో!– చదువుకోకపోతే మాత్రం ఏం?– నిన్ను పెళ్ళిచేసుకోలేదా? – డబ్బు సంపాదించలేదా?–"

"చాల్లే సంబడం!– ఇంటికి వుత్తరం వస్తే అదెవరు వ్రాసారో కూడా తెలీదాయె?. .. వాళ్ళనో వీళ్ళనో బతిమిలాడి చదివించు కుకోవాల్సి వస్తోందాయె...?–" గడుసుగా మాట్లాడింది గోవిందమ్మ.

భార్య మాటలకి చిన్న బుచ్చుకున్నాడు సాంబయ్య.

తాతయ్యకేసి విచిత్రంగా చూస్తూ "పో న్లే తాతయ్యా!... నేన్నీకు చదువు చెప్తాలే!– మరి... నా దగ్గర చదువునేర్చుకుంటావా? –" గమ్మత్తుగా మాట్లాడాడు కీర్తి.

"ఏమిటీ...?– ఇన్నేళ్ళొచ్చి ఇప్పుడు చదువుకోనా!?... పైగా ఐదేళ్ల కుంకవి! నువ్వు నాకు చదువు చెప్తావా" కళ్ళు పెద్దవిచేసి తమాషాగా తిప్పుతూ అన్నాడు సాంబయ్య.

"ఇప్పుడు వేరే పనేముంది మీకు?... మనమడి దగ్గర చదువైనా నేర్చుకోండి!...' రారా కీర్తీ! రా!!– నువ్వు స్నానం చేసి టిఫిన్ తిందువుగానిరా..." కీర్తిని చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది గోవిందమ్మ.

అవును!– తను చదవలేదు. వ్రాయలే దు. ఈ విషయం గురించి ఇన్నేళ్ళ



## జేబుదొంగ!

చిట్టిని ఆసక్తిగా అడిగాడు రాము.
"మీ నాన్న జేబులోంచి ఈవేళ ఎంత డబ్బు కొట్టేసావురా?"
"మా నాన్న జేబులు కొట్టడానికి ఇంకా వెళ్ళలేదు..."
"ఆ...?!"

—ఎ.ఉష్యాం (సికింద్రాబాద్)

జీవితంలో తాను ఎన్నడూ ఆలోచించనైనాలేదు. కేవలం డబ్బు సంపాదించటమే జీవిత పరమావధి అనుకున్నాడు.

ఈ క్షణంలో తాను కూడా చదువుకోవాలనుకున్నాడు. తన పేరు తాను సంతకం చెయ్యగలగాలి! పేపరు పుస్తకాలు చదవాలి... రాత్రికి టివిలో అక్షరజ్యోతి కార్యక్రమాన్ని శ్రద్ధగా చూశాడు సాంబయ్య.

తాను చదువు కోవటమేకాదు... నిరక్షరాస్యతా కార్యక్రమానికి తను చేయూతనివ్వాలనుకున్నాడు. తనవద్ద కావలసినంత డబ్బుమూలుగుతోంది. ఓ లక్ష రూపాయలు ఆ కార్యక్రమానికి విరాళం ఇవ్వటానికే నిర్ణయించుకున్నాడు.

* * *

సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంది!

అప్పుడే ఇంట్లోకొస్తున్న పత్రికా విలేకరులను ఆహ్వానిస్తూ "రండి! రండి!!... మీరంతా అట్లా సోఫాల్లో కూర్చోండి..." అన్నాడు సాంబయ్య.

"నమస్కారం సాంబయ్యగారూ..." కూర్చుంటూ అరడజనుమంది విలేఖరులూ ముక్తకంఠంతో అన్నారు.

ఇంతలో నౌకరు స్వీట్లు తెచ్చి అందరికీ సర్వే చేశాడు. తర్వాత కాఫీలొచ్చాయి!

"సాంబయ్యగారూ!— మీరు ఈ వయస్సులో ఎందుకు విద్య నేర్చుకోవాలనుకుంటున్నారు?—" ఓ విలేఖరి మొదటి ప్రశ్న.

"ఎందుకా... ఎందుకంటే... ప్రభుత్వం తలపెట్టిన అక్షరాస్యతా కార్యక్రమం గురించి దాని ప్రచారం గురించి... విలువ గురించి రోజూ వింటున్నాను. విద్యలో గొప్పతనం గురించి కొద్దికొద్దిగా తెల్సుకుంటున్నాను. నాకూ చదువుకోవాలనిపించింది. ఇన్నేళ్ళూ సంపాదించటం మీదే నా మనసు లగ్నమైంది— చదువుకోవాలనే ప్రయత్నానికి వయస్సుతో పన్లేదని తెల్సుకున్నాను. అందుకే నా ప్రయత్నం..."

"మీరు జిల్లా కలెక్టరుగారిని కూడా ఈ విషయంలో కల్సుకున్నారని విన్నాం..." మరో విలేఖరి అడిగేడు.

"అవునండీ!— ఏదో ఉడతా భక్తిగా అక్షరజ్యోతి కార్యక్రమానికి నేను కూడా విరాళం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను— నేను సంపాదించిన డబ్బు ఏ కొద్ది మందికైనా ఓ మంచి ప్రయత్నానికీ, ప్రయోజనానికీ ఉపయోగపడాలన్నది నా అభిలాష— ఈ విషయమై కలెక్టర్‌గారిని కల్సుకుని నా మనసులో కోరిక విన్నవించాను..." వినయంగా చెప్పాడు సాంబయ్య.

"బావుందండీ! మీ తదుపరి కార్యక్రమం గురించి కూడా విపులంగా చెప్తారా సాంబయ్యగారూ?—" ఇంకో విలేఖరి అడిగేడు.

"ఏముందండీ?!— అటు చూడండి... ఓ వెయ్యి పలకలు... ఓ వంద బలపాలపెట్టెలు కూడా కొనుక్కొచ్చి ఇంట్లో పెట్టాను! — వీటిని చదువునేర్చుకోవాలని ఆరాటపడే వారికి ఉచితంగా పంచిపెట్టాలని వుబలాటంగా వుంది. అక్షరాస్యతా కార్యక్రమంలో నేనూ ఓ చిరుదీపం కావాలనేది నా

కోరిక!!—''

విలేఖరులంతా చప్పట్లు కొట్టారు!

ఇంతలో కీర్తి బైటనుంచి అప్పుడే అక్కడికొచ్చాడు.

''తాతయ్యా! — నే చెప్పిన పాఠం బట్టీయంవేశావా?— వప్పచెప్పకపోతే స్టాండప్— ఆన్— ది బెంచ్' అంటాను!— బెత్తంతో వడ్డిస్తాను!!— తెల్సిందా?—'' వస్తూనే సాంబయ్యని సమీపిస్తూ అన్నాడు కీర్తి.

''పాఠం నోటికి వచ్చేసిందిరా కీర్తీ!—'' అంటూ కీర్తిని ఎత్తుకుని ముద్దాడేడు సాంబయ్య.

''నాకు చదువు నేర్పుతున్న గురువు ఎవరో కాదు!— ఇదుగో... వీడే!— నా మనుమడు!!—'' గర్వంగా మెరిసే కళ్ళతో చెప్పాడు సాంబయ్య.

''మీ కార్యక్రమం దిగ్విజయంగా కావాలని మేమంతా కోరుకుంటున్నాం...'' అంటూ విలేఖరులంతా లేచి నిలబడి సాంబయ్య దగ్గర శలవు తీసుకుని బైటికి నడిచారు.

తన వొడిలో వున్న కీర్తిని మరోసారి ముద్దాడి గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు సాంబయ్య. సాంబయ్య వదనంలో తృప్తి గర్వం తొంగి చూచేయి!!

*




తెల్లమచ్చలు

7 రోజులకు మందు ఉచితం

Add: RANI AYURVED (H.A.W.70)
P.O. KATRI SARAI (GAYA)



నెరసిన జుట్టు

ఆయుర్వేద వైద్యం ద్వారా తెల్ల వెంట్రుకలు కూడా
మామూలు రంగులోకి వస్తుంది. తెల్లని జుట్టు
నల్లని జుట్టుగా మారుతుంది. జుట్టు రాలడం ఆగిపోతుంది. వైద్యం
కోసం వెంటనే వ్రాయండి. ఒక సీసా రూ.25/- మూడు సీసాలు రూ.70/-

Add: RANI AYURVED (H.A.T.70)
P.O. KATRI SARAI (GAYA) India.



Add: RANI AYURVED (H.A.G.70)
P.O. KATRI SARAI (GAYA)